అక్షర
సకుటుంబ సచిత్ర అంతర్జాల మాసపత్రిక
ప్రత్యక్షరం సమకాలీన సమాజ సాక్ష్యం సహజ ధర్మ సంకేతం !



# బహుమతి

– ప్రతాప వెంకట సుబ్బరాయుడు



"ఆమెతో కాస్త మాట్లాడాలి"

శ్రీధనుష్ మాటలకి అక్కడున్న ఎవరూ ఆశ్చర్యపోలేదు కాని 'అతను ఆమెతో ఏం మాట్లాడాలనుకుంటున్నాడో' అన్న ఉత్సుకత అందరి ముఖాల్లో ద్యోతకమయింది.

'అమెరికా నుండి తిరిగొచ్చి ఇక్కడ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ పెట్టాలనుకుంటున్న ఆకర్షణీయమైన..ఆదర్శభావాలున్న..ఏ దురలవాట్లు లేని అబ్బాయికి, అమ్మాయి సుగుణవతియై..ఆమె తల్లిదండ్రులు మంచి సంప్రదాయవాదులై వుంటే చాలు కాణీ కట్నం తీసుకోకుండా పెళ్ళిచేసుకుంటాడట..ఈ మాట విన్న వెంటనే మనమ్మాయి శృతి నా మనసులో మెదిలింది. ఇలాంటి అదృష్టం ఎప్పుడో తప్ప తలుపు తట్టదు.మీరు కాస్త జాగ్రత్తగా వ్యవహరించారంటే అమ్మాయి అదృష్టం అందలమెక్కుతుంది.' పెళ్ళిల్లపేరయ్య రామానుజంగారి మాటలు వెంకట్రావుగారి చెవిలో మారు మ్రోగాయి.

"అలాగే బాబూ..తప్పకుండా" అంగీకార సూచకంగా అన్నారు వెంకట్రావుగారు.

తండ్రి మాటతో శృతి గుండెల్లో బాంబు పేలింది. 'అబ్బాయి అమెరికానుండి వచ్చాడని అంతా ఊదరగొట్టేస్తున్నారు. లోపలికి గదిలోకెళ్ళాక ఆయనేం అడుగుతారో..తనేం చెబుతుందో! పోనీ పట్నంలో చదువుకున్నా కాస్త ధైర్యంగా వుండేది. పల్లెటూరి దుంపలబళ్ళో వానాకాలం చదువు చదివిన తనకి పొట్టకోస్తే ఇంగ్లీషు అక్షరముక్క రాదు. తన అదృష్టానికి ఈ దెబ్బతో గండి పడడం ఖాయం..'

"అమ్మా శృతి..అబ్బాయి నీతో ఏదో మాట్లాడలనుకుంటున్నాడట! భయపడకుండా వెళ్ళి మాట్లాడు" ఆలోచనల్లో మునిగివున్న శృతి తండ్రి మాటలకు ఈ లోకంలోకి వచ్చి, గబ గబ లేచి తడబడే అడుగులతో అదిరిపడే గుండెలతో గదిలో[illegible].

అతను తలుపులు దగ్గరగా వేసి..అమాంతం ఆమెని పొదివి పట్టుకుని..ఎఱ్ఱెఱ్ఱని చెర్రీ పెదాలపై వెచ్చని మధురమైన ముద్దుని ముద్రించాడు.

ఆమె సంభ్రమంతో హతాశురాలయింది.

"చూడండి శృతిగారూ..ముత్యాలముగ్గు మధ్యన బంతీ..చామంతి..మందార పూలతో అలంకరింపబడి ఒద్దికగా వున్న అందమైన గొబ్బెమ్మలా ..అపురూప సౌందర్యరాశియైన మీరు అణకువతో సిగ్గుల మొగ్గై..నా ముందు కూర్చోలేక భూమిలోకి కుంచించుకు పోతూవుంటే..నా మనోవిహంగం ఆనందంతో గగనవిహారం చేసింది. నా చిరకాల నిరీక్షణ ఫలితం మీరేననిపించింది. మేము బాగా ఐశ్వర్యవంతులమయివుండడం నా విషయంలో శాపం అయింది. మా అమ్మ నన్ను యాంత్రికంగా కనిపడేసింది..నాన్న పట్టించుకోకుండా పెంచాడు. ఇంట్లో ఎప్పుడూ ఆర్థిక లావాదేవీలు తప్ప ఆప్యాయతలు మచ్చుకైనా కనిపించేవి కావు. డబ్బును యధేఛ్ఛగా సంపాదించడం విచ్చలవిడిగా కర్చు పెట్టడం..స్టేటస్ మెయిన్‌టెయిన్ చేయడం.. తప్ప వాళ్ళకు వేరే వ్యాపకం వుండేది కాదు.

డ్యూటీ చేసి సాయంత్రం భర్త తీసుకొచ్చే మూరమల్లెల కోసం ఎదురు చూసే ప్రేమ మా అమ్మలో నేను ఎప్పుడూ చూడలేదు. కొడుకు కోరుకునేది తీసుకొచ్చిచ్చి ఆ కొడుకు కళ్ళలోని వెలుగులు చూడాలన్న తాపత్రయం మా నాన్న ముఖంలో నాకు ఎంత వెదికినా కనిపించేదికాదు.

ఇంటా బయట అంతా కృత్రిమ అనుబంధాలు..కృతక అనుభవాలు. ఎడారిలో వుంటూ అదే నందనోద్యానవనమనుకునే హైక్లాసు భ్రమలో కాలం గడుపుతున్నారు. వాళ్ళలో మార్పు రావడమనేది కల్ల. అందుకే ఇక్కడికి దూరంగా మానసిక ప్రశాంతత కోసం అమెరికా వెళ్ళిపోయాను. మన సంస్కృతి సంప్రదాయాన్ని అమితంగా ఇష్టపడే నేను ఇక్కడి సంబంధాన్ని కోరుకున్నాను. ఈ విషయాలన్నీ అమెరికాలో నేనుండేటప్పుడు ఇక్కడి ఒక టీ వీ ఛానల్‌లో యాంకర్‌గా పనిచేసే నా కజిన్ శ్రీజకి ఈ-మెయిల్ చేస్తుండేవాడిని. మా ఫ్యామ్లీలో నా తపనని.. బాధని అర్థం చేసుకునేది తనొక్కతే!

కొద్దిరోజుల ముందు మీ ఊళ్ళో సంక్రాంతి పండగ సందర్భంగా ఒక కార్యక్రమ నిర్వహణకి వచ్చిన శ్రీజ నీ అందాన్ని చూసి

స్టన్నయిపోయిందట. నిజానికి ఇప్పుడు నా పరిస్థితీ అదే అనుకో! ఇక్కడ రంగవల్లుల పోటీ పెడితే నీకు ఫస్ట్ ప్రయిజ్ వచ్చినా నీకు ఇవ్వలేదట. అంతేకాదు ఆ తర్వాత పెట్టిన రెండు మూడు పోటీల్లో కూడా నువ్వే ఫస్ట్ వచ్చినా నీకు ప్రైజ్ ఇవ్వలేదట. దానికి నువ్వు ఉడుక్కుని..బుంగమూతి పెట్టుకుని..కందిన ముఖంతో ఇంటికెళ్ళావట! ఆ తర్వాత మీ గురించి పరిపూర్ణంగా తెలుసుకుని మీ ఇంటికొచ్చి ' ఆ చిన్న చిన్న బహుమతులు నీకెందుకు? నేను నీ జీవితాంతం గుర్తుంచుకునే మంచి బహుమతిని ఇస్తానందిట..ఈ విషయాలన్నీ నాకు మెయిల్ చేసింది. నిజమేనా?"అన్నాడు చిలిపిగా.

"అవును నిజమే..కానీ నాకే బహుమతీ ఇవ్వలేదే!" అమాయకంగా అంది.

"ఆ బహుమతి నేనన్న మాట! అని అల్లరిగా నవ్వి, "నేను ఉన్నపళంగా ఇండియా వచ్చేయాలని లేకపోతే ఈ రాజకుమారిని ఎవరో ఒకరు ఎత్తుకుపోవడం ఖాయమని తెగ హడావుడి చేసి నన్ను ఆఘమేఘాలమీద ఇక్కడికి రప్పించింది..రామానుజంగారు మీ నాన్నగారితో నా గురించి మాట్లడ్డానికి కారణం కూడా తనే! నిన్ను చూసేదాకా నేను ఇంత అదృష్టవంతున్ననుకోలేదు. ఇక్కడి సంస్కృతి ప్రకారం నాకు నువ్వు మనసా వాచా నచ్చావు. ఇహ నేను నీకూ నచ్చితే మనిద్దరికీ శీఘ్రమే వివాహ ప్రాప్తిరస్తు."అన్నాడు చిలిపితనం మాటల్లో చిందులేయిస్తూ.

శృతి బుగ్గలు సిగ్గుతో మంకెనపూలయ్యాయి. చేతుల్లో ముఖం దాచుకుని తుర్రుమని బయటకి పరిగెత్తింది.

"అమ్మాయి సిగ్గు,  అబ్బాయి దొంగనవ్వులు చెప్పకనే చెబుతున్నాయి ఉభయుల మనసులు ముడిబడ్డాయని, పెద్దలమైన మనమే కొంగుముడి వేయించాలని.. ఇకనేం శుభస్య శీఘ్రం" అన్నారు రామానుజంగారు.

***

మాఘమాసంలో..ఆకాశమంత తాటాకు పందిళ్ళేసి..భూదేవంత పీటేసి ఊరందరి సమక్షంలో సీతారామ కల్యాణంలా జరిగింది వాళ్ళిద్దరి పెళ్ళి.

"నేనిచ్చిన బహుమతి బాగుందా?" శోభనం రాత్రి గదిలోకి వెళ్ళబోతున్న శృతిని నవ్వుతూ అడిగింది శ్రీజ.

ఆమె ఋణం తీర్చుకోలేనన్నట్టుగా కళ్లనీళ్ళతో ఆమెని కౌగలించుకుంది.

"మా అన్నయ్యని కంటికి రెప్పలా కాపాడుకో! వాళ్ళ వాళ్ళ మధ్య ఏ ఆప్యాయతానురాగాలు కోల్పోయాడో అవి అతనికి సంపూర్ణంగా అందజేయి చాలు" అంది.

సరే నన్నట్టుగా ఆమె చేతిలో చేయి వేసి సన్నగా నొక్కింది శృతి.

"ఏడు మల్లెల ఎత్తున్న పదహారణాల అందమైన పడుచు పిల్లని నా అర్ధాంగిని చేసినందుకు నీకు మంచి జోడీని చూసి అంగ రంగ వైభవంగా పెళ్ళిచేస్తాను కానీ ఇప్పటికి ఆమెని వదులు మాకు చాలా చాలా 'కార్య'క్రమాలున్నాయి."అన్నాడు అప్పుడే అటుగా వచ్చిన  శ్రీధనుష్.

అత్తిపత్తిలా మారిపోయి శృతి గది లోపలికి తుర్రుమంటే, శ్రీధనుష్ తలమీద చిన్నగా మొట్టి చిన్నగా నవ్వుతూ దూరంగా వెళ్ళిపోయింది శ్రీజ!

Add Comment

Log In to Post

NEWEST ▼